సాక్షి పెద్దపల్లి

గురువారం । 13 । జూలై । 2023



ఔషధ గుణాల గోరింటాకు

గోరింటాకుకు మన సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉంది. ముఖ్యంగా స్త్రీల జీవన విధానంలో గోరింటాకుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. 8లో▸



బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నిరసన ఉద్రిక్తం

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బుధవారం ధర్మారం మండల కేంద్రంలో తెలిపిన పోటాపోటీ నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు.. మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే చందర్



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్‌ను సచివాలయంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం కలిశారు. రామగుండం వైద్య కళాశాలకు సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)గా నామకరణం, సింగరేణి కార్మికులకు 50 బెడ్లతో ప్రత్యేక వార్డు ఏర్పాటు, ఉద్యోగుల పిల్లలకు వైద్య కళాశాలలో ఐదు శాతం కోటా కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో పెద్దంపేట, రాయదండి ఇతర గ్రామాల రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించి రెవెన్యూ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిశారు. ముందుగా రామగుండం ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులతో రీజినల్ లేబర్ కమిషనర్ సునిల్ కుమార్ సాహూ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సింగరేణి సీఎండీ శ్రీధర్‌ను కలిసి స్థానిక జవహర్‌లాలానెహ్రూ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. డిజిటల్ గ్రంథాలయం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు.

14న చలో కలెక్టరేట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: రైస్ మిల్ ఆపరేటర్స్ కనీస వేతనాల జీవోను రాష్ట్రప్రభుత్వం సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. పట్టణంలో మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని అన్నారు. తొమ్మిదేళ్లుగా వేతనాల జీవోను సవరించకుండా పెండింగ్‌లో పెట్టిందని, తద్వారా రాష్ట్రంలో సుమారు కోటి మంది కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లకోసారి పెరగాల్సిన వేతనం 15 ఏళ్లుగా మార్పురావడం లేదన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, సుల్తానాబాద్ మండల నాయకులు చంద్రయ్య, పురం హరికిషన్, బ్రహ్మాచారి, భగవాన్, స్వామి, చంద్రయ్య, మహేందర్, రవి, రాజమౌళి పాల్గొన్నారు.

దారి మైసమ్మ తల్లికి పూజలు



దారి మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రామగుండం: అంతర్గాం మండలం రాజీవ్ రహదారిపై ఉన్న దారి మైసమ్మ తల్లికి భక్తులు బుధవారం పూజలు చేశారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న అమ్మవారి సన్నిధిలో వాహన పూజలు జరిపించారు. ఎస్సై సంతోష్‌కుమార్ తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇన్‌చార్జి డీవైఎస్‌ఓగా సురేష్



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన సురేష్

పెద్దపల్లిరూరల్: జిల్లా యువజన క్రీడలశాఖ (డీవైఎస్‌ఓ) అధికారిగా సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జూలపల్లి జెడ్పీహెచ్ఎస్ పీడీగా వ్యవహరిస్తున్న సురేష్‌కు డీవైఎస్‌ఓగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సురేష్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని కలిశారు. ఆయన వెంట పీఈటీలు సురేందర్, శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

‘అప్పగింతలు’ ఎప్పుడో..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండంలోని ఫైవింక్లయిన్ ఏరియా, మాల్కాపూర్ శివారులో నిర్మించిన 660 ఇళ్లు. ఈ ఇళ్లకు లబ్ధిదారులను మార్చి 16న రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక చేశారు. అయితే ఇప్పటివరకు ఎవరికీ హక్కు పత్రాలు ఇవ్వలేదు. మరోపక్క ప్రభుత్వం తాజాగా గృహలక్ష్మి పథకం తీసుకొస్తుండటంతో రెండింటికి చెడ్డ రేవడి అవుతుందేమోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని కూనారం, చందాపల్లి ప్రాంతాల్లో నిర్మించిన 484 డబుల్ బెడ్రూం ఇళ్లకు రిజర్వేషన్ల ప్రాతిపదికన అర్హులను మార్చి 15న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సమక్షంలో లాటరీ తీస్తున్నది. ఎస్సీలకు 17శాతం చొప్పున 81మందికి, మైనార్టీలకు 12శాతం చొప్పున 55 మందికి, ఎస్టీలకు 6శాతం చొప్పున 10ఇళ్లు, దివ్యాంగులకు ప్రతి విభాగంలో 5శాతం చొప్పున 17, ఓపెన్ కేటగిరీలో 321 ఇళ్లకు లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా నివాసయోగ్యానికి కావాల్సిన ప్రొసీడింగ్ కాపీలు ఇంతవరకూ ఇవ్వలేదు.





ఈ చిత్రంలో కనిపిస్తున్న మంథనిలోని పోచమ్మవాడలో 92 ఇళ్లు. వీటికి 72 మందిని అర్హులుగా గుర్తించి వారికి హక్కుపత్రాలు ఇచ్చి తాళం చెవులు ఇవ్వడంతో వారు నివాసం ఉంటున్నారు. జిల్లాలో కేవలం ఒక్క మంథనిలో తప్ప మరెక్కడ లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం యోగం దక్కలేదు. మరోపక్క ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కరెంట్, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు తదితర పనులుకాక దరఖాస్తులు స్వీకరించినప్పటికీ లబ్ధిదారులను ఎంపిక చేయలేదు.

- కళ్ల ముందే కలల సౌధాలు
- ‘డబుల్’ ఇళ్ల కోసం ఎదురుచూపులు..
- నేటికీ లబ్ధిదారులకు అందని హక్కు పత్రాలు
- లక్కీడ్రాలో ఎంపిక చేసినా కేటాయించని వైనం
- నాలుగు నెలలైనా పట్టించుకోని అధికారయంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి: సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలోనే ఉంటూ కిరాయి భరిస్తూ ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు గృహయోగం కలిగినా.. గృహప్రవేశం చేసే భాగ్యం మాత్రం కలగడంలేదు. పెద్దపల్లి, రామగుండం మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లను లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా గతంలోనే ఎంపిక చేశారు. ఇళ్లు, స్థలం లేనివారిని అర్హులుగా గుర్తించి సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్ కేటగిరిని అనుసరించి లబ్ధిదారుల సమక్షంలో లక్కీ డ్రా ఎంపిక చేశారు. తరువాత అభ్యంతరాలు స్వీకరించి, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి.. పరిశీలించి అందులో కొందరిని అనర్హులుగా గుర్తించి పక్కకు పెట్టారు. మిగిలిన వారు నాలుగు నెలలుగా డబుల్ బెడ్రూం ఇళ్ల హక్కుపత్రాలు అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

గృహలక్ష్మి పథకం అమలుతో..

స్థల సమస్య, నిధుల సమస్యతో గూడులేని నిరుపేదలకు గృహయోగం కల్పించేందుకు ప్రభుత్వం కొత్తగా గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. సొంతం స్థలం ఉండి మూడు నిర్మాణ దశలను అనుసరించి రూ.3లక్షల సహాయం, ప్రతి నియోజకవర్గంలో 3వేల మందికి వర్తింపచేయాలని ప్రకటించింది. అయితే ఇటు డబుల్ బెడ్రూంలు అందక.. ఇటు గృహలక్ష్మికి అర్హులం కాకుండా మిగిలిపోతామని లబ్ధిదారులు వాపోతున్నారు.

వసతులు కల్పించకపోవడంతోనే..

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇళ్ల పత్రాలను ఇంకా ముద్రించలేదు. మరోపక్క ఎంపిక చేసిన ఇళ్ల వద్ద రహదారులు, మురుగుకాలువలు, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించలేదు. అక్కడ మౌలిక వసతులు లేకపోవడం.. కల్పించే వరకూ ఇళ్ల పట్టా ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోపక్క కేంద్రప్రభుత్వం అమలు చేసే ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద దరఖాస్తు చేయటంతో కొంత ఆలస్యమైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇదే విషయమై డబుల్ బెడ్రూం ఇండ్ల నోడల్ అధికారి నర్సయ్యను వివరణ కోరగా... లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులపై ఫిర్యాదులు రావటంతో మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేయటంతో ఆలస్యమవుతోందని తెలిపారు. అలాగే కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తిచేసిన వెంటనే మంత్రులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో గృహప్రవేశాలు చేయిస్తామని తెలిపారు.

రైతులపై కాంగ్రెస్‌కు కక్ష

- రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- కమాన్‌చౌరస్తాలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం



రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాకేంద్రంలోని కమాన్‌చౌరస్తాలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే రైతుబంధు, బీమాలాంటి పథకాలను రద్దు చేస్తారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్, జెడ్పీటీసీ రామ్మూర్తి, విండో చైర్మన్ నర్సింహరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.6,768



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు బుధవారం రూ.6,768 పలికింది. కనిష్టంగా రూ.5,268, సరాసరి రూ.6,611గా నమోదైందని మార్కెట్ కార్యదర్శి పృథ్వీరాజ్ తెలిపారు.

బీసీలకే టికెట్ ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో వక్తల డిమాండ్



జిల్లా కేంద్రంలో సమావేశమైన నాయకులు

పెద్దపల్లిరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే టికెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్కే గార్డెన్‌లో బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువీర్‌ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, నాయకులు బి.రమేశ్‌గౌడ్, దాసరి ఉష, ధర్మయ్య, సదానందం, ధనుంజయ, రాజేశ్, ఆకుల స్వామివివేక్, స్వప్న, కళావతి పాల్గొన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు ఓట్లు వేస్తే అత్యల్ప జనాభా ఉన్న అగ్రవర్ణాలు ఆధిపత్యం చలాయిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకే అన్ని ప్రధాన రాజకీయపార్టీలు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 1994 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీసీ అభ్యర్థి బిరుదు రాజమల్లును గెలిపించిన చరిత్ర ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బీసీలంతా ఏకమై బీసీలకే అధికారం దక్కేలా చూడాలని నిర్ణయించారు.

బీఆర్‌ఎస్ నాయకులను గ్రామాల్లోకి రానీయొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు

ఓదెల: బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాలకు వస్తే అడ్డుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలని మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గాల్లో డబుల్ బెడ్‌రూంలను లబ్ధిదారులకు అప్పగించారని, పెద్దపల్లిలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. మానేరు నుంచి ఇసుక తరలిస్తూ దోచుకుంటోందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు 3100 దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, తూంల సుభాష్‌రావు, భూతగడ్డ సంపత్‌రావు, సర్పంచ్ అంకం రమేశ్, మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్యగౌడ్, సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, దన్నాయక్ దామోదర్‌రావు, పుప్పాల శంకర్, సింగిల్‌విండో డైరెక్టర్ బైరి రవిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో ఉన్నత విద్య

- పదో తరగతి, ఇంటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం
- ఇంటి వద్ద నుంచే చదువుకునే అవకాశం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 53 కేంద్రాలు
- ప్రవేశాలకు చివరి తేదీ ఆగస్టు 10



ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్

జ్యోతినగర్: చదువు మధ్యలో మానేసినవారు ఉన్నత విద్యనభ్యసించేందుకు రాష్ట్రం ప్రభుత్వం చక్కని అవకాశం కల్పిస్తోంది. దూరవిద్య విధానం (ఓపెన్ స్కూల్)లో చదువుకునేలా చూస్తోంది. ఈ పద్ధతిలో ఉన్నత చదువులు చదివినవారు ఎంతో మంది ఉన్నారు. ప్రస్తుత సంవత్సరానికి గాను ఈ నెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇంటి వద్ద ఉండి, పదోతరగతి, ఇంటర్ చదవాలనుకునే పురుషులు, మహిళలకు ఇది సదవకాశం. సర్కారు 2008–09లో పదోతరగతి, 2010–11 నుంచి ఇంటర్ కోర్సులను ప్రారంభించింది. 2020–21 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించినా కరోనా కారణంగా పరీక్షలు జరిపే అవకాశం లేకుండా పోయింది. 14 ఏళ్ల వయసు పైబడినవారు సార్వత్రిక పాఠశాలలో చేరి, 10వ తరగతి, 15 ఏళ్లు నిండి, పదోతరగతి పూర్తి చేసినవారు ఇంటర్ చదివేందుకు అర్హులు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 53 కేంద్రాలున్నాయి.

దరఖాస్తు విధానం..

ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు ఆసక్తి ఉన్నవారు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందినవారికి సార్వత్రిక విద్యాపీఠం వారు సర్టిఫికెట్లు అందిస్తారు. వీటిని ఉన్నత విద్య, ఉద్యోగాలకు వినియోగించుకోవచ్చు.

వయసు నిర్ధారణ ధ్రువపత్రం..

పదోతరగతి చదివేందుకు ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదు. 14 నుంచి 50 ఏళ్ల వయసువారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నిర్ధారణ ధ్రువపత్రం తహసీల్దార్ లేదా పురపాలక సంఘం అధికారులు జారీ చేసింది ఉండాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ), ఆధార్‌కార్డుతో ప్రవేశం పొందవచ్చు.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు..

ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ 2023–24 విద్యాసంవత్సరంలో చేరేవారు ఎలాంటి లేట్ ఫీజు లేకుండా ఆగస్టు 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు. పదోతరగతికి రూ.1,150, ఇంటర్‌కు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. సంబంధిత ఆన్‌లైన్ రశీదు, దరఖాస్తు జిరాక్స్‌ను సమీపంలోని అధ్యయన కేంద్రంలో అందించాలి.

మూడేళ్లలో పరీక్షలకు హాజరైనవారు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోగత మూడేళ్లలో(2020–23 వరకు) 27,336 మంది పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు. జగిత్యాల జిల్లాలో 5,476 మంది పదోతరగతి, 3,415 మంది ఇంటర్, పెద్దపల్లి జిల్లాలో 2,778 మంది పదోతరగతి, 3,762 మంది ఇంటర్, కరీంనగర్ జిల్లాలో 3,210 మంది పదోతరగతి, 3,612 మంది ఇంటర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 2,759 మంది పదోతరగతి, 2,323 మంది ఇంటర్ పరీక్షలు రాశారు.

ఉపాధి అవకాశాలు



ఓపెన్ స్కూల్‌లో చదివి ఉత్తీర్ణులైనవారు తమ ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చు. ఇలా సద్వినియోగం చేసుకున్న వారు చాలామంది ఉన్నారు. ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతంలోని యువతకు ఉన్నత విద్య చదివేందుకు మంచి అవకాశం.

– సీహెచ్.నాగేశ్వరరావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయ కర్త

ఉన్నత విద్యకు వేదిక



చదువు మధ్యలో మానేసిన వారికి దూరవిద్య ద్వారా చదువుకునేందుకు చక్కటి వేదిక ఓపెన్ స్కూల్. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఆగస్టు 10 చివరి తేదీ. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకొని, ఉన్నత చదువులు చదువుకోవాలి.

– ఇరుగురాల ఓదెలు, కో–ఆర్డినేటర్, అంతర్గాం

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



పెద్దపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 7వరోజుకు చేరింది. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని పేర్కొంటూ జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఏళ్ల తరబడి పంచాయతీల్లో పనిచేస్తున్న వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు ప్రైవేట్ కార్మికులతో పనులు చేయించేందుకు యత్నించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు తమవంతు సహకారం అందించి సమస్యకు పరిష్కారం చూపేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. నాయకులు తిరుపతి, సత్యనారాయణ, రాజయ్య, రాజమౌళి, ముస్తఫా, శ్రీనివాస్, శారద, రాజేశ్వరి తదితరులున్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు

- డీసీపీ వైభవ్ గైక్వాడ్
- ఆపరేషన్ ముస్కాన్, ఐగీ అమలుపై సమీక్ష



సూచనలిస్తున్న డీసీపీ వైభవ్‌గైక్వాడ్

పెద్దపల్లిరూరల్: పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో బాలకార్మికులతో పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీసీపీ వైభవ్‌గైక్వాడ్ అన్నారు. చిన్నారులు పనులకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల ఒకటి నుంచి మొదలైన ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాలకార్మికులను గుర్తించి వారిని విముక్తి చేయడంతోపాటు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయమై జిల్లా ఆపరేషన్ ముస్కాన్ టీం, పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. 18 ఏళ్ల లోపు బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలతో ఎవరైనా భిక్షాటన, వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఐగీలో భాగంగా బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రత్యేకంగా ప్రతి డివిజన్‌లో ఎస్సైతోపాటు నలుగురు సిబ్బందిని నియమించామని, వీరితోపాటు ఇతరశాఖల అధికారులతో వెళ్లి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సాధారణ పౌరులు బాలకార్మికులను గమనిస్తే వెంటనే 1098, డయల్ 100కు సమాచారమివ్వాలని కోరారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గోదావరిఖని: సీజనల్ వ్యాధులపై సింగరేణీయులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య అధికారి డాక్టర్ సుమన్ అన్నారు. బుధవారం జీడీకే-5 ఓసీపీపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వర్షాకాలంలో దోమల నుంచి సంక్రమించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వ్యాధులు, నివారణ చర్యలను వివరించారు. డెంగీ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వానాకాలంలో వేగంగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. నీళ్ల నిల్వ ఉండే ప్రదేశాల్లోనే ఇవి ఎక్కువగా పెరుగుతాయన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-బి వంటి అంటువ్యాధులు సోకకుండా మంచి నీటిని కాచి చల్లార్చి, ఫిల్టర్ చేసుకొని వాడాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీడీకే-5 ఓసీపీ సందర్శన



గోదావరిఖని: డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ సింగ్ బుధవారం జీడీకే-5 ఓసీపీని సందర్శించారు. క్వారీలో రక్షణపై తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట డీఎంఎస్ నాగేశ్వర్‌రావు, ఆర్‌అండ్‌డీ జీఎం ఎస్‌డీఎం సుభానీ, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ తదితరులున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి/కమాన్‌పూర్: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని నాగేపల్లికి చెందిన రామిండ్ల రవికి కోర్టు జరిమానా విధించినట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రవి తన ఇంటికి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, మొదటి నేరంగా భావించి, రూ.1,000 జరిమానా విధించి వదిలేశారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడగా కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతన్ని బుధవారం పెద్దపల్లి జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంత్‌కుమార్ ఎదుట హాజరుపర్చగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి రూ.10,557 చెల్లించాలని, లేదంటే మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి గ్రామ శివారు వ్యవసాయ భూమి వద్ద జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బొట్లవనపర్తికి చెందిన కర్రె లచ్చయ్య బుధవారం తన వ్యవసాయ భూమిలో ఉన్న తాటి చెట్లను నరికివేశాడు. అనంతరం తాటిమొద్దులను గుడికందుల సాయిలు భూమిలో వేశాడు. సాయిలు వాటిని తన భూమిలో ఎందుకు వేశావని లచ్చయ్యను ప్రశ్నించగా తన భూమిలోనే వేసుకున్నానని బదులిచ్చాడు. దీంతో మాటా మాట పెరిగి, దాడి చేసుకున్నారు. లచ్చయ్య ఫిర్యాదు మేరకు సాయిలు, అతని కుమారుడు సురేష్‌పై, సాయిలు ఫిర్యాదు మేరకు లచ్చయ్యతోపాటు మహేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఔషధ గుణాల గోరింటాకు

- స్త్రీల జీవన విధానంలో ఎంతో ప్రాధాన్యం
- ఏ శుభకార్యం జరిగినా కాళ్లు, చేతులకు పెట్టుకోవడం ఆనవాయితీ
- ఆషాఢమాసం నేపథ్యంలో సందడి
- చర్మవ్యాధులు, శరీరంలో వేడిని తగ్గిస్తుందంటున్న వైద్యనిపుణులు



గోరింటాకు వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం మహిళలు

సుల్తానాబాద్: గోరింటాకుకు మన సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉంది. ముఖ్యంగా స్త్రీల జీవన విధానంలో గోరింటాకుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇంట్లో ఏ వేడుక జరిగినా చేతులు, కాళ్లకు పెట్టుకోవడం ఆనవాయితీ. ఆషాఢ మాసం వచ్చిందంటే గోరింటాకు చెట్టు ఎక్కడ ఉన్నా మహిళలు, యువతులు వెతికి మరీ ఆకులు తెచ్చుకొని, మెత్తగా రుబ్బి చేతులు, కాళ్లకు పెట్టుకుంటారు. ఎంత బాగా పండితే అంతగా వారి జీవితం సుఖసంతోషాలతో ఉంటుందని నమ్మకం. దీంతోపాటు గోరింటాకులోని ఔషధ గుణాలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. జూన్ 19 నుంచి జూలై 17 వరకు ఆషాఢమాసం. వర్ష రుతువులో ప్రారంభమయ్యే ఈ నెలలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆచారంగా వస్తోంది.

పట్టణాల్లో ఉపాధి..

గ్రామాల నుంచి చాలామంది గోరింటాకును పట్టణాలకు తీసుకెళ్లి, విక్రయిస్తున్నారు. ఫలితంగా ఈ నెల మొత్తం వారికి ఉపాధి దొరుకుతుంది. కానీ ప్రస్తుతం ఆధునిక పోకడలతో గోరింటాకు ఆషాఢ మాసంలో మినహా ఎక్కువగా కనిపించడం లేదని మహిళలు అంటున్నారు. శుభకార్యాల్లో గోరింటాకు బదులు మెహందీని వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్దడాన్ని కొంతమంది ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. ఇటీవలి కాలంలో వేణుగోపాలస్వామి, వాసవీమాత ఆలయాల్లో ఆర్యవైశ్య సంఘం మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు గోరింటాకు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. భవిష్యత్ తరాలకు గోరింటాకు ఉపయోగాన్ని తెలిపేందుకు, యువతులు, మహిళలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.



తెలుగువారి సంప్రదాయం



ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగువారి సంప్రదాయం. అందుకే మహిళలు ఇప్పటికీ ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే గోరింటాకే బాగుంటుంది.

– పల్లా అపర్ణ, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు, సుల్తానాబాద్

చిన్నప్పటి నుంచి ఇష్టం



నాకు గోరింటాకు పెట్టుకోవడమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఆషాఢమాసంలో స్నేహితులతో పోటీపడి మరీ పెట్టుకొని, ఎర్రగా పండేవరకు ఎంత సమయమైనా వేచిచూస్తాం.

– కొమురవెల్లి అక్షిత, గృహిణి, సుల్తానాబాద్

యాంటీబయాటిక్‌గా పని చేస్తుంది



వానాలం నీటిలో తడవడంతో కాళ్లు, చేతులకు వచ్చే చర్మవ్యాధులను గోరింటాకు యాంటీబయాటిక్‌గా పనిచేసి, తగ్గిస్తుంది. గోళ్లకు అందాన్నివ్వడమే కాకుండా శరీరంలో వేడిని తీసివేస్తుంది.

– డాక్టర్ రమాదేవి, గైనకాలజిస్ట్, ప్రభుత్వ ఆసుపత్రి, సుల్తానాబాద్

బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ నిరసన



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- ఇరుపార్టీల నాయకుల వాగ్వాదం
- నచ్చజెప్పి, పంపించిన పోలీసులు

ధర్మారం: బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బుధవారం ధర్మారం మండల కేంద్రంలో తెలిపిన పోటాపోటీ నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ బీఆర్ఎస్ డౌన్ డౌన్, కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.. ధర్మారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రాష్ట్ర రహదారిపై కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీనియర్ నాయకుడు మద్దెల రవీందర్‌ల ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని, దిష్టిబొమ్మ లాక్కున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. అదే సమయంలో బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని, రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ డౌన్‌డౌన్ అంటూ నినదించారు. ఎస్సై సత్యనారాయణ ఇరుపార్టీల నాయకులకు నచ్చజెప్పి, అక్కడినుంచి పంపించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.సలామొద్దీన్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.రఫీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దెల రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, నాయకులు కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో అవస్థలు

పది నిమిషాలు రోడ్డు పక్కన నిల్చోవాలంటేనే భయమేస్తోందని అంటున్నారు జిల్లాలోని సెంటనరీకాలనీ వాసులు. లారీల రాకపోకలతో రోడ్డుపై నుంచి దుమ్ము లేచి ఇళ్లలోకి, దుకాణాల్లో చేరుతోందని అంటున్నారు. వందలాది ఇసుకలారీల ప్రయాణాలపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రివేళల్లో అతివేగంగా వెళుతున్న లారీలతో ప్రమాదాలూ జరుగుతున్నాయని అంటున్నారు. అధికారులు దృష్టి సారించి రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

- డీవైడీజీఎంఎస్(మైనింగ్) భూషణ్‌ప్రసాద్ సింగ్
- ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డీవైడీజీఎంఎస్(మైనింగ్) భూషణ్‌ప్రసాద్ సింగ్ అన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశాన్ని బుధవారం సెంటనరీకాలనీలోని సీఎస్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సంస్థ ప్రమాద రహిత సింగరేణిగా ఉండాలని, రక్షణలో మైనింగ్ అధికారులు, యాజమాన్యం, యూనియన్ నాయకులు సంస్థకు మూడు పిల్లర్లలాంటి వారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంఎస్ నాగేశ్వరరావు, డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, రక్షణ జీఎం గురవయ్య, జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు బెహరా, అరుముగం, వెంకన్న, దిలీప్‌కుమార్, సుబాని, సాంబయ్య, యూనియన్ నాయకులు గౌతం శంకరయ్య, వైవీ రావు, మధునయ్య, కుమారస్వామి, కొమురయ్య, మామిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వండి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ హౌస్ కీపింగ్ కాంట్రాక్టు కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు పెంచకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 22వ జీవోను గెజిట్ చేసి, అమలు చేయాలని కోరారు. కోలిండియా తరహా హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, సర్క్యులర్ ప్రకారం ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలన్నారు. లేకపోతే అన్ని డివిజన్ల కాంట్రాక్టు కార్మికులతో కలిసి, ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శారద, మేరీ, లక్ష్మి, అనసూయ, రాజేశ్వరి, లింగయ్య, రాములు, పద్మ, రాజమణి, భాగ్యలక్ష్మి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా కనకయ్య



నియామకపత్రం అందిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఆలిండియా ఎన్టీపీసీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగి బండారి కనకయ్యను నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి కేపీ చంద్రవంశీ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా ఆయనకు నియామకపత్రం అందజేశారు. కనకయ్య ఐఎన్టీయూసీ అనుబంధ సంస్థల్లో కీలక పదవులను నిర్వహించడంతోపాటు ఎన్టీపీసీ రామగుండం సంస్థ ఉద్యోగ గుర్తింపు సంఘం అధ్యక్షుడి, ప్రధాన కార్యదర్శిగా హోదాల్లో పని చేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యులు, బాబర్ సలీంపాషా సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి కొలిపాక మల్లయ్య, నాయకులు కందుల స్వామి, సమ్మిరెడ్డి, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరినాటుకు డ్రమ్‌సీడర్ అనుకూలం



వరి నాటును పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

పాలకుర్తి: ప్రస్తుత సీజన్‌లో డ్రమ్‌సీడర్‌తో వరినాటు వేసే విధానం అనుకూలమని, రైతులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి, కన్నాల గ్రామాల్లో పర్యటించి, రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు తక్కువగా కురవడంతోపాటు ఆలస్యమైనందున ఇంకా నార్లు పోసుకోవడం కాకుండా నేరుగా వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్ ద్వారా నాటువేసే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ విధానంలో ఎకరానికి కేవలం 10 కిలోల విత్తనాలు సరిపోతాయని, పంటకోత 10 రోజుల ముందుకు వస్తుందన్నారు. నీటి వినియోగం తక్కువ, పెట్టుబడి ఖర్చు కూడా తక్కువేనని, కలుపు నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పంటల సాగు వివరాలను వ్యవసాయ విస్తీరణాధికారుల వద్ద నమోదు చేయించుకున్నట్లయితే మార్కెటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. పంటల నమోదును సూచించే కొత్త యాప్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రకాశ్, ఏఈవో శశిధర్, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలకు లోన్లు ఇవ్వాలి



సమావేశమైన వాల్మీకి బోయ నాయకులు

ఎలిగేడు: వాల్మీకి బోయ కులస్తులకు అన్యాయం చేస్తే రాజకీయ పార్టీలకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెపుతామని వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్ అన్నారు. బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలోని వాల్మీకి బోయ సంఘం భవనంలో సంఘం మండల అధ్యక్షుడు బుకాల సారయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానం చేశారు. వాల్మీకి బోయలకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న లోన్లలో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుల వృత్తి లేని వాల్మీకి బోయలు వేట వృత్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకర్టిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయాన్ని వీరికీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో 52 శాతం ఉన్న బీసీలకు వార్షిక బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయిస్తూ అణిచివేస్తున్నారని మండిపడ్డారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. నాయకులు బలంతుల ఎల్లప్ప, బోగె శ్రీనివాస్, ముత్కల మల్లేశం, కుడుదుల తిరుపతి, శంకర్, ముంజ మల్లయ్య, బోగె సతీశ్, ముత్కల శ్రీధర్, కెంగర్ల మహేందర్, గుజ్జుల నంబయ్య పాల్గొన్నారు.

గోదావరిఖని ఏసీపీగా శ్రీనివాసరావు



గోదావరిఖని: రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ ఏసీపీగా పని చేస్తున్న తుల శ్రీనివాసరావు గోదావరిఖని ఏసీపీగా బదిలీ అయ్యారు. గోదావరిఖని ఏసీపీగా పని చేస్తున్న ఎస్.గిరిప్రసాద్‌ను హైదరాబాద్ చీఫ్ ఆఫీస్‌కు, రామగుండం కమిషనరేట్ ఎస్‌బీ ఏసీపీగా పని చేస్తున్న బాలుసాని మోహన్‌ను జైపూర్ ఏసీపీగా, జైపూర్ ఏసీపీగా పని చేస్తున్న నరేందర్‌ను హైదరాబాద్ చీఫ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాకేశ్ (ఫైల్)

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన పిట్టల రాకేశ్ (31) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాకేశ్‌కు గ్రామంలో ఎకరంన్నర పొలం ఉండగా సాయంత్రం నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. వ్యవసాయ బావివద్ద ఉన్న స్టార్టర్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

పరిష్కారం కాని భూవివాదం

- కేసు నమోదు చేసిన పోలీసులు
- ఏళ్లుగా నానుతున్న సమస్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్ శివారులో సర్వేనంబర్ 385/14లో రెండెకరాల భూమిపై వివాదం కొనసాగుతోంది. హరిదాస్‌నగర్‌కు చెందిన అన్నదమ్ములు ఉప్పుల మల్లయ్య, ఉప్పుల ఎల్లయ్య ఆ భూమిలో కొన్నాళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఇటీవల ఉప్పుల ఎల్లయ్య కొడుకు రవి అదే సర్వేనంబర్‌లోని 20 గుంటల స్థలాన్ని అతని భార్య లత పేరిట 2013లో లావణి పట్టా చేయించుకున్నాడు. అప్పటి నుంచి మల్లయ్య, ఎల్లయ్య కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది. మల్లయ్య కుటుంబ సభ్యులు తనను బెదిరించారని రవి ఫిర్యాదుతో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ విషయమై ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ జయంత్‌కుమారును వివరణ కోరగా.. అది ప్రభుత్వ భూమి అని.. సర్వే పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని వావిలాలపల్లికు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కందుల రాజయ్య(57) నిత్యం రైల్వేస్టేషన్ సమీపంలో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తుంటాడు. బుధవారం రైల్వే ట్రాక్‌పై నడుస్తుండగా కరీంనగర్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రాజయ్య చిన్న కుమారుడు సందీప్ వచ్చి, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య శంకరమ్మ విద్యుత్‌శాఖలో పని చేస్తోంది. ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు సాగర్ విదేశాల్లో, చిన్న కుమారుడు స్థానికంగా ఉంటున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు రామగుండం రైల్వే పోలీసులకు సమాచారం అందించగా ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విధివంచితుడిని ఆదుకోవాలి

- వెంటాడిన నరాల బలహీనత
- నడవలేని స్థితిలో బాలుడు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



బాలుడి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బుడి.. బుడి అడుగులతో ఆ ఇల్లు ఎంతో సందడిగా ఉండేది. కొడుకు కళ్లముందు ఇంట్లో తిరుగుతుంటే ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఆలస్యంగా సంతానం కలుగగా.. ఆ ఒక్కగానొక్క కుమారుడికి ఉన్నట్టుండి నరాల బలహీనతతో నిలబడలేక.. నడవలేక నరకం అనుభవిస్తుంటే ఆ తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాకు చెందిన నిరుపేద గిరిజన దంపతులు భూక్య లలిత–శ్రీనివాస్ ఆటో కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి మనోజ్‌కుమార్(9), పది నెలల కూతురు ఉంది. మనోజ్‌కుమార్‌ను స్థానికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి వరకు చదివించారు. వేసవి సెలవుల అనంతరం ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలకు వెళ్లకముందే మనోజ్‌కుమార్ నరాల బలహీనత వ్యాధికి గురయ్యాడు. రోజురోజుకు వ్యాధి తీవ్రత పెరగడంతో ప్రస్తుతం నడవలేక.. నిలబడలేక నరకం అనుభవిస్తున్నాడు. మనోజ్‌కుమార్‌కు సుమారు రూ.3 లక్షల వరకు వెచ్చించి సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ వంటి పట్టణాల్లో పెద్ద ఆస్పత్రులలో చూపించారు. అయినా వ్యాధి నయం కాలేదు. 64 శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందడం లేదు. ఖరీదైన వైద్యం అందించడానికి రూ.6లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆటో జీవనాధారంగా బతుకుతున్న ఆ కుటుంబం కుమారుడిని కాపాడుకునేందుకు ఆపన్నహస్తం కోసం దాతలను అర్థిస్తున్నారు.

ఆదుకోవాలని వేడుకోలు

నడవలేని స్థితిలో ఉన్న కొడుకు ఆరోగ్య పరిస్థితిని బాగుచేయించాలని మంగళవారం ఆ తండాకు వెళ్లిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను లలిత–శ్రీనివాస్ దంపతులు వేడుకున్నారు. స్పందించిన ఆయన బాలుడి పరిస్థితిని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించడంతోపాటు దివ్యాంగుల పెన్షన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

దాతలు సాయం చేయాల్సిన నంబర్
శ్రీనివాస్, ఫోన్‌పే : 96188 74300